ప్రజల ముంగిటకే పాలన

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- గంగుబూడిలో గ్రామ సచివాలయం ప్రారంభం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజ, తదితరులు

లక్కవరపుకోట: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ప్రజల ముంగిటకే వచ్చిందని, ప్రభుత్వ సేవలన్నీ సచివాలయంలోనే అందుతున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగుబూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్సీలు కడుబండి శ్రీనివాసరావు, ఇందుకూరి రఘురాజుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. గత నాలుగేళ్లలో వేల కోట్ల రూపాయలతో గ్రామాల్లో సచివాలయాలను నిర్మించినట్లు చెప్పారు. గతంలో ఏదైనా పథకం కావాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు గడప వద్దకే పథకాలు వచ్చి అందుతున్నాయన్నారు. జాతీపిత మహాత్మా గాంధీ ఆకాంక్షించిన గ్రామస్వరాజ్యం నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైందన్నారు. ఇలాంటి సీఎం పది కాలాల పాటూ కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. 14 ఏళ్ల సీఎంగా చేశానని చెప్పుకుంటున్న మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడు విజయగనరం జిల్లాకు ఒక మంచి పని కూడా చేయలేదని, ఇప్పుడు మళ్లీ తనకు అధికారం ఇస్తే అది చేస్తా, ఇదిచేస్తా అని ఊదరకొడుతున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికలే తెలుగుదేశం పార్టీకి చివరి ఎన్నికలన్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ.. రాష్ట్రం కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో పాలన ఆదర్శవంతంగా ఉందని మేధావులే అంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎల్.కోట, వేపాడ ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, ఎస్.కోట వైస్ ఎంపీపీలు ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఆవాల శ్యామల, వేపాడ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగన్నాథం, గంగుబూడి సర్పంచ్ గొలగాని హరిప్రసాద్, పార్టీ నాయకులు గొరపల్లి రవికుమార్, గొలగాని సత్యనారాయణ, ఇమంది ముత్యాలు, కొత్తవలస ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రా శ్రీనివాసరావు, కొట్యాడ శ్రీనివాసరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం



సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరరావు



రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త లక్షణరావు

బొండపల్లి: వరి పంటను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, అప్పుడే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని గాజులరేగ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ తేజేశ్వరరావు అన్నారు. మండలంలోని గరుడుబిల్లి ఆర్‌బీకేలో రైతులకు వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. కాలిబాటలు ఏర్పాటు చేయడం ద్వారా దోమపోటు ఉధృతిని నివారించొచ్చన్నారు. ఎరువులు, పురుగు మందు పిచికారీ చేసుకునేందుకు కాలిబాటలు అనువుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ కె.మహరాజన్, గ్రామ సర్పంచ్ బోద్దల కృష్ణవేణి, ఎంపీటీసీ పాలూరి జోగమ్మ, నాయకులు బోద్దల చిన్నంనాయుడు, పిల్లా రమణమ్మ, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, ఏఈఓ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణపై రైతులకు అవగాహన

దత్తిరాజేరు: పంటల సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని విజయనగరం రైతు శిక్షణా కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణరావు సూచించారు. పెదమానాపురం గ్రామ సచివాలయంలో రైతులకు వరిలో సస్యరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగం వల్ల తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని, దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. అగ్గి తెగులు, పాముపొడ తెగులు సోకినడుపు పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ మహారాజన్, ఏఓ అనురాధ ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



గృహసారథుల వివరాలు సేకరిస్తున్న జేసీఎస్ కన్వీనర్ బంగారునాయుడు

గుర్ల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషి చేయాలని జేసీఎస్ కన్వీనర్ బెల్లాన బంగారునాయుడు అన్నారు. మండలంలోని గుజ్జింగివలసలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ బీమా సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. బీమా నమోదు కోసం గృహసారథుల వివరాలను సేకరించారు. సమావేశంలో గూడెం సొసైటీ అధ్యక్షుడు రెడ్డి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి అప్పలనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేవీకే ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జేసీ మయూర్ అశోక్

దత్తిరాజేరు: మండలంలోని చినచామలాపల్లి వద్ద కృషి విజ్ఞాన కేంద్రం నిర్మాణానికి జేసీ మయూర్ అశోక్ బుధవారం స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఉన్న కృషివిజ్ఞాన కేంద్రం పార్వతీపురం మన్యం జిల్లాకు కేటాయించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక్కడ స్థల పరిశీలన చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు కేంద్ర బిందువుగా ఉండడంతో పాటు గిరిజన యూనివర్సిటీకి దగ్గర్లో ఉండటం వల్ల ఇక్కడ విద్యనభ్యసించే విద్యార్థులు వ్యవసాయ పంటలపై పరిశోధనలు చేసేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో 35 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం ఉందని, మరో 15 ఎకరాలను రైతుల నుంచి సేకరించనున్నట్లు తెలిపారు. అనంతరం ఈ-క్రాప్ నమోదుపై వ్యవసాయశాఖ ఏడీఏ మహారాజన్, ఏఓ అనురాధలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి డీటీ రమేష్, వీఆర్వో అప్పలనాయుడు ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



వెంకటరమణపేటలో సమరభేరి కార్యక్రమం నిర్వహిస్తున్న సిపిఎం నేతలు

శృంగవరపుకోట: మతోన్మాద కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపకుంటే దేశ ప్రతిష్ట మంటకలిసిపోవటం ఖాయమని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ధ్వజమెత్తారు. మండలంలో వెంకటరమణపేట గ్రామంలో బుధవారం సమరభేరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగం, ధరల నియంత్రణలో మోడీ సర్కారు విఫలమైందన్నారు. పెట్టుబడిదారులకు కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ దేశ ఖజానాను గుల్ల చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రాల హక్కులు హరిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసోందని, ప్రజలపై పన్నుల భారం మోపుతోందని విమర్శించారు. మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చల్లా జగన్, మద్దిల రమణ, ఎర్రాప్రగడ భాస్కరరావు, పోకల భాస్కరరావు, బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి, ప్రజా సంక్షేమంపై దృష్టిసారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. బొద్దాంలో బుధవారం ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. లౌకిక రాజ్యంలో మతోన్మాద దాడులకు తావులేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో చలుమూరి శ్యామ్, షేక్ అబ్దుల్లా, షేక్‌బుడ, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

43 మందికి కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం బొండపల్లి గ్రామంలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ, గరివిడి లైన్స్ కంటి ఆస్పత్రి సంయుక్తంగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 43 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 16 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. నేత్రాల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మానవీయతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషిచేయాలి

కొత్తవలస: క్రీడాభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కృషిచేయాలని నియోజకవర్గ పీఈటీల కోఆర్డినేటర్ కె.కృష్ణంరాజు అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి వ్యాయామోపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్‌ను బుధవారం నిర్వహించారు. లక్కవరపుకోట, ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, జామి మండలాలకు చెందిన 39 మంది పీఈటీలు హాజరైయారు. క్రీడాభివృద్ధికి పీఈటీలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం సీహెచ్ ఈశ్వరరావు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

కొత్తవలస: సీజనల్ జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు సూచించారు. కొత్తవలస పీహెచ్‌సీని బుధవారం ఆయన సందర్శించారు. వియ్యంపేట, ఎల్.కోట, కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో సేవలందించే ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకొని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల్లో డెలివరీలు పెరిగేలా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వైద్యసేవలు అందించాలన్నారు. అన్ని గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సీతల్‌వర్మ, సింహాద్రినాయుడు, సీతామహలక్ష్మి, మురళీకృష్ణ, పలువురు సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సహాయకులు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



ఎస్పీ చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై రవి

బొండపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఎస్.రవి జిల్లా ఎస్పీ ఎం.దీపికా పాటిల్ చేతుల మీదుగా బుధవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. నేరాల నియంత్రణతో పాటు కేసుల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నందుకు ప్రశంసాపత్రం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ రామారావు

జామి: రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను ఈ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వీటీ రామారావు అన్నారు. మండల కేంద్రంలోని కొండపాటిపాలెం వద్ద వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు యాప్‌లో మార్పులు చేయడం జరిగిందన్నారు. పంటల నమోదులో వచ్చే సమస్యలు, యాప్ వినియోగంలో తలెత్తే ఇబ్బందులను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఓ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఉత్తమ బోధన అందించాలి: డీఈఓ



ఉపాధ్యాయలతో మాట్లాడుతున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

గంట్యాడ: విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని వసాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఎడ్యుకేషన్ సర్వేను శతశాతం పూర్తిచేయాలని వలంటీర్లకు సూచించారు.

గడపగడపలో సంతోషం..



ఎస్.కోటలో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ప్రతీ గడపలో సంతోషం నింపడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట మేజర్ పంచాయతీ సచివాలయం-3 పరిధిలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రతీ గడపకు వస్తున్నామన్నారు. ఒక్కో కుటుంబానికి గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ఇంకా ఎవరికైనా పథకాలు అందనట్లయితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు పినిశెట్టి వెంకటరమణ, రాష్ట్ర ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, ఎంపీటీసీ కె.అప్పయ్య, వార్డు సభ్యులు బి.ఎర్నమ్మ, కె.ఈశ్వరి, గనివాడ శ్రీను, మజ్జి శేఖర్, నాయకులు బుగత వెంకటేశ్వరరావు, మామిడి శంకర్, కె.పాల్‌కుమార్, కె.జయశంకర్, పాపారావు, మోపాడ కోటి, ఈశ్వరఅప్పలనాయుడు, చిప్పాడ రమణ, ఎలమంచిలి అప్పారావు, నేతేటి శివ, ఒబ్బిన బంగారు నాయుడు, భాస్కర్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన బోధన అందించేందుకు కృషిచేయాలి

వేపాడ: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించటంతో పాటు వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ బాలభాస్కరరావు సూచించారు. బొద్దాం, సోంపురం, వేపాడ పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ ట్రయినింగ్‌లో ఉపాధ్యాయురాలు సీహెచ్ దేవీ ప్లే అండ్ యాక్టివిటీ పద్ధతిలో టీఎల్‌ఎం తయారు చేయడంతో పలువురు ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

రక్షాబంధన్



శృంగవరపుకోట: డీవీఎల్ పాఠశాలలో రక్షాబంధన్ ఉత్సవాలు



శృంగవరపుకోట: కౌముది గ్లోబల్‌స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



చీపురుపల్లి రూరల్: పోలీసులకు రాఖీలు కడుతున్న బీకే శాంతి



బొండపల్లి: పోలీసు సిబ్బందికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

చీపురుపల్లి రూరల్: పరమాత్మతో పవిత్ర బంధానికి ప్రతీకగా రక్షాబంధన్‌ను జరుపుకుంటారని బ్రహ్మకుమారీస్ చీపురుపల్లి సేవా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే శాంతి అన్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మాజీ జెడ్పీటీసీ మీసాల వరహాలనాయుడు, ఆర్డీఓ ఎం.అప్పారావు, పోలీస్ సిబ్బందికి, స్టేట్ బ్యాంక్, మండల పరిషత్ కార్యాలయం, గ్రామ సచివాలయ ఉద్యోగులకు రాఖీలు కట్టారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రైవేటు కళాశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో ఉన్న బ్రహ్మకుమారీస్ విద్యాలయంలోని బ్రహ్మకుమారీలు మండల కేంద్రంలోని వివిధ కార్యాలయాల ఉద్యోగులకు రాఖీలు కట్టి వారి ఆశీస్సులు స్వీకరించారు.

పాఠశాలల్లో..

శృంగవరపుకోట: పట్టణంలోని పలు పాఠశాలల్లో రాఖీ పౌర్ణమి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రక్షాబంధన్ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. విద్యార్థినులు తమతోటి విద్యార్థులకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

చీపురుపల్లి రూరల్: విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు కృషిచేయాలని జీఎంఆర్ ఐటీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పవన్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సోషల్ వలంటర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సమస్యలను దృఢంగా ఎదుర్కొన్నప్పుడే విజయాలు సొంతమవుతాయన్నారు. ఈ సందర్భంగా నైతిక విలువలతో కూడిన 150 పుస్తకాలను విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ రెడ్డి రమణ, హెచ్‌ఎం ఎస్.రెహెనా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశం

శృంగవరపుకోట: మండలంలో తిమిడి ఉన్నత పాఠశాల విద్యార్థిని బొలిరెడ్డి గోపిక ఏపీ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎస్.మాధవీలత బుధవారం తెలిపారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో విద్యార్థిని 558 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ప్రవేశం లభించినట్లు సమాచారం అందిందన్నారు. హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు గోపికను అభినందించారు.

క్లుప్తంగా

విద్యుత్ మీటర్లకు ఆధార్ అనుసంధానం



విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధానం చేస్తున్న సిబ్బంది

బొండపల్లి: ప్రతీ విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ నంబరుతో అనుసంధానం చేసుకోవాలని ఎలక్ట్రికల్ ఏఈఈ జి.శంకరరావు తెలిపారు. బొండపల్లి సచివాలయం ఆవరణలో బుధవారం విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ అనుసంధాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో జేఎల్‌ఎం వద్దకు వెళ్లి తమ ఆధార్ నంబరుతో అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. బొండపల్లి మండలం వ్యాప్తంగా 18వేలు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సాయం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యుత్ సమస్యకు దాతల సహకారంతో పరిష్కారం లభించిందని ప్రిన్సిపాల్ ఎం.కిశోర్‌కుమార్ బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తుప్పల్లో దూరంగా ఉండడంతో కొద్దిపాటి గాలి వీచినా ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు ఎక్కువ మొత్తంలో చలానా తీయాలని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. దీంతో సహస్ర ట్రస్టు రూ.12,897, మజ్జి శేఖర్, పెదబాబు, సుభాష్, ఎ.పెదబాబు రూ.5వేలు చొప్పున విరాళాలు అందజేశారు. ఈ మొత్తంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు మార్పు చేయడంతో పాటు పాఠశాలలో పాడైన వాటర్ ఫిల్టర్, మరుగుదొడ్ల మరమ్మతు పనులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సాయం అందించిన దాతలకు ప్రిన్సిపాల్, బోధనా సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

53 మందికి వైద్య సేవలు



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలం శ్రీరంగరాజపురం గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మందికి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారిణి సుష్మ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణ ప్రియాంక, ఆశా వర్కర్ బి.అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల నిరసన



నిరసన తెలుపుతున్న స్టాంప్ వెండర్లు, రైటర్లు

శృంగవరపుకోట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డ్ ప్రైమ్ 2.0 విధానం వల్ల ప్రజలకు ఉపయోగం లేదని, న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయని స్థానిక దస్తావేజు లేఖర్లు ఆందోళన వక్తం చేశారు. ఈ మేరకు బుధవారం వారంతా పెన్ డౌన్ చేపట్టి స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కార్డ్ ప్రైమ్ 2.0 విధానం వల్ల ఈ వృత్తిపై ఆధారపడ్డ వేల కుటుంబాలు రోడ్డున పడతాయి. పూర్తిగా దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ దస్తావేజులను అసలు దస్తావేజులుగా చలామణి కావడంతో న్యాయపరమైన తగాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు తెలుసుకోవాలి



రైతులకు సూడోమోనస్ ప్యాకెట్లు అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

జామి: వరిసాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై ప్రతీ రైతు అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ డి.భారతి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీ ఎల్.విజయతో కలిసి వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఊభాలు, సాగునీరు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, తెగుళ్లు, కలుపు నివారణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సూడోమోనస్ జీవన ఎరువు వినియోగం, దాని ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులకు శతశాతం రాయితీపై సూడోమోనస్ మందును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ కిరణ్‌కుమార్, వీఏఏ కరీం పాల్గొన్నారు.